క్లుప్తంగా

బొడ్రాయి ప్రతిష్ట పూజలు

మాగనూర్: మక్తల్ మండలం టేకులపల్లిలో బొడ్రాయి, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠాపన పూజలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జలంధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

ఊట్కూరు: స్థానిక తహసీల్దార్ సతీష్‌కుమార్ ఎదుట సోమవారం బిజ్వార్ చెందిన 13 మందిని ఎస్‌ఐ గోకారి బైండోవర్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు కాకుండా, గత పంచాయతీ ఎన్నికల్లో గొడవలు పడి కేసులు నమోదైన వారిని బైండోవర్ చేసినట్లు తెలిపారు.

విద్యార్థికి సన్మానం



మాగనూర్: హకీపేట క్రీడా పాఠశాలకు ఎంపికైన మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఐదవ తరగతి విద్యార్థి ఉపేంద్రను పాఠశాల ఉపాధ్యాయులు, జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోపాలం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పాఠశాల తరఫున రూ.6వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివరాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థి తండ్రి నర్సింహులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నర్వ: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ రాజేందర్‌గౌడ్ ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని నర్వ, లంకాల్, ఉందేకోడ్, పాథర్చేడ్, రాయికోడ్, రాజుపల్లి, జంగంరెడ్డిపల్లి, రాంపూర్ గ్రామాల్లో మంగళవారం ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు కరెంట్ సరఫరా ఉండదని తెలిపారు.

విజయవంతం చేయండి

మాగనూర్ (మక్తల్): హైదరాబాద్‌లో 15,16,17వ తేదీల్లో నిర్వహించే సీడబ్ల్యూసీ సమావేశాలను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి సోమవారం కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.

త్రిదివతి వేద ప్రచారం ప్రారంభం



ఊట్కూరు: మండల కేంద్రంలోని ఆర్యసమాజ్ భవనంలో సోమవారం శ్రావణమాస త్రిదివతి వేద ప్రచార కార్యక్రమం ప్రారంభించారు. ఆర్యసమాజ్ భవనం ఎదుట ఓంకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఉదయం, సాయంత్రం వేళలో పండిట్ విశ్వక్‌శ్రవ ఆధ్వర్యంలో దేవయజ్ఞాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన ప్రవచనాలు చేశారు.

బీజేపీ నిరసన



నారాయణపేట: తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసినటువంటి వ్యాఖ్యల్ని ఖండిస్తూ సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యయాదవ్‌లు మాట్లాడుతూ సనాతన ధర్మం వైపు ఎవరైనా వేలెత్తి చూపిన, ధర్మంపై తప్పుగా మాట్లాడినా హిందూ సమాజమంతా ఒకే తాటిపైకి వచ్చి ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెంకటయ్య, శ్రీనివాసులు, రఘురామయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంస్మరణ సభ కరపత్రం విడుదల



మద్దూరు: ప్రజాకవి గద్దర్, సియాసత్ ఎడిటర్ జహిరోద్దీన్ అలీఖాన్ సంస్మరణ సభ కరపత్రాన్ని సోమవారం మద్దూరులోని అతిథి గృహం వద్ద ప్రజా సంఘాల నాయకులు విడుదల చేశారు. 13న కొడంగల్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు సంస్మరణ సభ ఉంటుందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, పొన్నయ్య, దాసు, కృష్ణ, సాయిలు, చిన్నయ్య, మనీశ్వ, ప్రవీణ్ తదితరులు తెలిపారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



అమ్లికుంట్లలో అభిషేకం అనంతరం ప్రత్యేక అలంకరణలో స్వామివారు



కోస్గిలో గంగా స్నానానికి వెళ్తున్న భక్తులు



మద్దూరులో నీలకంఠస్వామి జల్ది ఊరేగింపు

కోస్గి: గుండుమాల్ మండలంలోని అమ్లికుంట్లలో దశాబ్దాల చరిత్ర కలిగిన వీరభద్రేశ్వరుడి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం చివరి సోమవారం పురస్కరించుకొని పలు గ్రామాలకు చెందిన భక్తులు ప్రత్యేక పూజలకు హాజరుకాగా ఆలయ పూజారి వినయ్ కుమార్ ఆధ్వర్యంలో అభిషేకం, అలంకరణ, మహామంగళ హారతి చేశారు.

మార్మోగిన శివనామ స్మరణ..

పట్టణమంతా శివనామ స్మరణతో మార్మోగింది. కురిహిసెట్టి(జాంధ్ర సంఘం) ఆధ్వర్యంలో శ్రావణ మాస ముగింపు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నీలకంఠస్వామి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం పల్లకీలో స్వామి వారిని ఊరేగిస్తూ ఆటపాటలు, భజనల నడుమ గంగా స్నానానికి తీసుకెళ్లారు. ప్రతి గడప నుంచి నీటి బిందెలతో యువకులు, కుల పెద్దలు, సంఘ నాయకులు వేడుకల్లో పాల్గొన్నారు. వేడుకల్లో యువకుల ఆటపాటలు, నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

పార్వతీపరమేశ్వరునికి పల్లకీసేవ

కృష్ణా: మండలంలోని చేగుంటలో గల పార్వతీపరమేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను సోమవారం సాయంత్రం భక్తులు పల్లకీలో ఊరేగించారు. ఆదివారం కృష్ణానది నుంచి తీసుకొచ్చిన నది నీటితో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

మద్దూరు: శ్రావణమాస చివరి సోమవారం పురస్కరించుకుని మండల కేంద్రంలో నీలకంఠస్వామి ఉత్సవాలను కురిహీణశెట్టి (జాంధ్ర సంఘం) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు నీలకంఠస్వామి దేవాలయం నుంచి పాతబస్టాండ్‌లోని శివాలయం వద్ద ఉన్న బావి నుంచి జల్ది ఊరేగింపు నిర్వహించారు. అనంతరం నీలకంఠుడికి అభిషేకం, విశేషపూజలు పూజారి వాసుదేవచారి ఆధ్వర్యంలో చేశారు. సాయంత్రం స్వామి వారి పల్లకీ సేవ నిర్వహించారు. పురవీధుల గుండా జాంధ్ర సమాజం, భక్తులు నందికోళ, ఖడ్గాలు ఆడారు.

వీరభద్రేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే పూజలు..

దామరగిద్ద: మండలంలోని క్యాతన్‌పల్లి భద్రకాళి సమేత వీరభద్రేశ్వర స్వామిని సోమవారం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి దర్శించుకున్నారు. శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను తీసుకున్నారు.

గ్రామాభివృద్ధికి ప్రభుత్వం ఎనలేని కృషి



పులిమామిడిలో రైతువేదిక భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఊట్కూర్: గ్రామాభివృద్ధికి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పులిమామిడిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రైతువేదిక భవనం ప్రారంభం, పంచాయతీ భవనం ప్రారంభం, మత్య సహకార సంఘం భవనానికి భూమి పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. నియోజకవర్గంలో 46 రైతువేదిక భవనాలను నిర్మించామన్నారు. గ్రామాలకు బీటీ రోడ్లు, కల్వర్టులు, డ్రెయినేజీలు నిర్మించామన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల వల్ల నిత్యావసర ధరలు పెరిగాయని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మి, జెడ్పీటీసీ అశోక్‌కుమార్‌గౌడ్, వైస్ ఎంపీపీ ఎల్లాగౌడ్, సర్పంచ్ సూరయ్యగౌడ్, సింగల్‌విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిడుగుర్తి పాఠశాల పరిశీలన

ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తి ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం ఎంఈఓ వెంకటయ్య పరిశీలించారు. జిల్లాలో కలెక్టర్ ప్రత్యేక చొరవతో చేపట్టిన వెలుగు కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న పరీక్షలను ఆయన తనిఖీ చేశారు. పరీక్షలు నిర్వహించిన వెంటనే మూల్యాంకనం పూర్తి చేసి ఎంఆర్‌సీ కార్యాలయానికి పంపించాలని సూచించారు.

పోషణమాసం వేడుకలు



ఊట్కూర్: మండలంలోని అవుసలోనిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణమాసం వేడుకలను నిర్వహించారు. సూపర్‌వైజర్ గీతా బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. విధిగా ఆకుకూరలు, చిరుధాన్యాలు తినాలని సూచించారు. రాగులు, సజ్జలు, సామలు, జొన్నలు ఇతర చిరుధాన్యాలతో వంటలు తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో కార్యదర్శి శివానంద్, కవిత, శ్రీలత, సావిత్రమ్మ, శరణమ్మ పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ నిర్వహించాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

మాగనూర్ (మక్తల్): ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీ నిర్వహించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం మక్తల్ నియోజకవర్గకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో విద్యార్థి బలిదానాలతో ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకుంటే ఇవాళ బీఆర్‌ఎస్ పార్టీ విద్యార్థులకు తీరని మోసం చేస్తుందని ఆరోపించారు. ఉపాధ్యాయ నియామకాల్లో 13వేల పోస్టులు ఖాళీలు ఉంటే కేవలం 5,069 పోస్టులను మాత్రమే వేయడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం కార్పొరేట్ విద్యాలయాలకు కొమ్ముకాస్తూ ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తుందన్నారు. విచ్చలవిడిగా మద్యం అమ్మకాలకు బెల్టుషాపులకు అనుమతి ఇస్తున్న ప్రభుత్వానికి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ఎందుకు వివక్ష చూపిస్తుందన్నారు. కార్యక్రమంలో బండారి చంద్రశేఖర్, పాలెం వెంకటయ్య, పరశురాం, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగి మృతి

నర్వ: మండలంలోని రాంపూర్ చెందిన వీఆర్‌ఏ కావలి ఆంజనేయులు(58) గుండెపోటుతో సోమవారం అకస్మికంగా మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇటీవల వీఆర్‌ఏ వ్యవస్థను సర్దుబాటు చేస్తూ ప్రభుత్వం వీరికి లస్కర్ విధులు అప్పగించడంతో ఈయన మరికల్ మండలంలో ఇరిగేషన్‌శాఖలో పనిచేస్తున్నాడు. అదనంగా బీఎల్‌ఓగా ఎన్నికల విధులు నిర్వహిస్తుండడంతో పనిఒత్తిడి కారణంగా గుండె పోటుతో మరణించారని గ్రామస్తులు వాపోతున్నారు. ఆకస్మికంగా మృతి చెందిన ఉద్యోగి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల వినూత్న నిరసన



జిల్లా కేంద్రలో నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

నారాయణపేట రూరల్: సమగ్రశిక్ష ఉద్యోగులు 7వ రోజు వినూత్నంగా తమ నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద మున్సిపల్‌పార్క్ వద్ద సోమవారం మోకాళ్లపై కూర్చున్నారు. వారు మాట్లాడుతూ.. వెట్టి చాకిరికి స్వస్తి పలికి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సర్వీసును రెగ్యులర్ చేసి తమ కుటుంబాలకు ఆదుకోవాలని కోరారు. మహిళ సిబ్బందికి ప్రసూతి సెలవులు, మరణించిన ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించి అంత్యక్రియల ఖర్చులను అందించాలన్నారు. కార్యక్రమంలో ఎల్లాగౌడ్, రవికుమార్, నారాయణపవర్, కృష్ణారెడ్డి, రాజశేఖర్, రవిప్రకాష్, ఆరీఫ్‌అహ్మద్, కరీష్మ, శశికాంత్, నాగేందర్, వెంకట్‌రెడ్డి, సత్యమ్మ, రాజేశ్వరి, కళావతి, పవిత్ర పాల్గొన్నారు.

మాగనూర్ (మక్తల్): సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అల్తాఫ్ హుస్సేన్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష అభియాన్ కింద పనిచేస్తున్న ఉద్యోగులందరూ వారం రోజులుగా డిమాండ్ల సాధనకై ఉద్యమ బాట పట్టిన స్పందన మాత్రం లేకుండా పోయిందన్నారు.

స్థల పరిశీలన

అమరచింత: పట్టణంలోని బస్టాండ్ ప్రాంగణంలో వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటు కోసం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థల పరిశీలన చేపట్టామని కమిషనర్ మహమ్మద్‌ఖాజ తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి సమక్షంలో చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయడానికి వీలుగా అనువైన స్థలానికి ఎంపిక చేశామన్నారు. భవిష్యత్తులో రోడ్ వైడింగ్‌ను దృష్టిలో ఉంచుకొని బస్టాండు ఆవరణంలో చివరి భాగంలో స్థలాన్ని నిర్ణయించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ఎస్‌ఏ రాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ నాగభూషణం గౌడ్, బాలరాజ్, రాజేష్, ప్రేమరత్నం తదితరులు పాల్గొన్నారు.

'దళితబంధు'లో పారదర్శకత పాటించాలి



ఏఓకు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్ సలీం, దళిత కుటుంబాలు

నారాయణపేట: గ్రామసభ ద్వారా పారదర్శకత పాటించి అర్హులైన వారిని ఎంపిక చేసి దళితబంధు ఇవ్వాలని సోమవారం కలెక్టరేట్‌లో ఏఓ నర్సింగ్‌రావుకు సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా అప్పిరెడ్డిపల్లి కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి నర్సింహ, ప్రశాంత్ మాట్లాడుతూ గ్రామంలో నిరుపేదలైన దళితులకు దళితబంధు ఇవ్వకుండా అక్కడున్న బీఆర్‌ఎస్ నాయకులకు ఇచ్చారన్నారు. ఆర్థికంగా ఉన్న వారిని, ఎస్సీ కార్పొరేషన్ వివిధ పథకాల ద్వారా రుణాలు తీసుకుని లబ్ధిపొందిన వారిని వ్యవసాయ భూములు కలిగిన వారిని ఎంపిక చేయడంతో పథకం పక్కదారి పడుతుందన్నారు. కార్యక్రమంలో సాయిలు, శ్రీకాంత్, హన్మంతు, రాములు, నాగేష్, రమేష్, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు అందరికీ ఇవ్వాలి..

నారాయణపేట మున్సిపాలిటి పరిధిలో అర్హులందరికి దళితబంధు అందరికీ ఇవ్వాలని కోరుతూ 7వ వార్డు కౌన్సిలర్ మహ్మద్ సలీం ఆ వార్డు దళిత కుటుంబాలతో కలిసి కలెక్టరేట్ ఏఓ నర్సింగ్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. వార్డులో ఏడు దళిత కుటుంబాలు ఉన్నాయని, వారు పూరిగుడిసెలు వేసుకుని దుర్భర జీవితం గడుపుతున్నారన్నారు. దళితబంధు ఇవ్వకుండా వివక్ష చూపుతున్నరని ఆరోపించారు. అర్హులైన వారికి దళితబంధు ఇవ్వాలని కోరారు.

బీజేపీ ఆధ్వర్యంలో వినతి..

మండలంలోని కోటకొండ చెందిన ఎస్సీ కులస్తుల ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం తీసుకువచ్చిన దళితబంధు పథకం ద్వారా గ్రామానికి సంబంధించిన సభ్యుల ఎంపిక సరిగా చే యలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు వివరించారు. వినతి పత్రం అందజేసిన వారిలో శ్రీనివాసులు, కృష్ణ, నర్సింహులు, రాములు, బాలప్ప, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

ఆత్మకూర్: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగికి ఆర్థికంగా సహకరించి అండగా నిలిచారు వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్ రెడ్డి. మండలంలోని వీరరాఘవపూర్‌కు చెందిన చిన్నయ్య అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యానికి రూ 2.50లక్షలు ఖర్చు అవుతుండడంతో విషయం తెలుసుకున్న వర్కటం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుతో మాట్లాడి రూ.1.50లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించి సోమవారం బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా చిన్నయ్య కుటుంబ సభ్యులు, వీరరాఘవపూర్ గ్రామస్తులు వర్కటంకు కృతజ్ఞతలు తెలిపారు.

యాదాద్రిలో మూలమళ్ల భజన మండలి ప్రతిభ

ఆత్మకూర్: యాదాద్రి నర్సింహాస్వామి ఆలయం నుంచి మండలంలోని మూలమళ్ల గ్రామానికి చెందిన శ్రీపాండురంగస్వామి భజన మండలికి పిలుపు రావడంతో సోమవారం వారు తరలివెళ్లారు. వనపర్తి జిల్లాలోనే మూలమల్ల భజనమండలికి మంచి గుర్తింపు రావడంతో శ్రీనర్సింహాస్వామి సన్నధిలో గీతాపాలన చేసేందుకు పిలుపు వచ్చినట్లు మండలి అధ్యక్షుడు సత్యారెడ్డి తెలిపారు. సోమవారం ఆలయంలో నిర్వహించిన భజన కార్యక్రమంలో తమ బృందానికి ప్రత్యేకంగా ఆలయ నిర్వాహకులు అభినందించారన్నారు. కార్యక్రమంలో భజనమండలి సభ్యులు భగవంత్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సునంద్‌గౌడ్, శేఖర్, కురుమూర్తి, కుమార్, భాస్కర్, శ్రీనివాస్ రెడ్డి, సంజన్న, ఆనంద్ ఉన్నారు.

లబ్ధిదారులకు భూపట్టాలు ఇవ్వాలి



ర్యాలీగా వెళ్తున్న లబ్ధిదారులు

మరికల్: మండల కేంద్రంలో ప్రభుత్వం పంపిణీ చేసిన భూములకు పట్టాలు ఇవ్వాలని కార్మిక సంఘం నాయకులు గోపాల్, మల్లయ్య, గోవర్ధన్, రఘు డిమాండ్ చేశారు. భూములు లేని వారికి అందజేసిన సర్వేనంబర్ 449లో అధికారులు సర్వే చేయడంపై నిరసనగా సోమవారం ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ సునితకు వినతి సమర్పించారు. వారు మాట్లాడుతూ గతంలో భూమిలేని వారికి అందజేసిన భూముల్లో అధికారులు వెంటనే సర్వే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు తెలియకుండా ప్రభుత్వం ఈ భూమిని లాక్కోవాలని చూస్తుందని ఆరోపించారు.

మిషన్‌భగీరథ నీటి సరఫరా బంద్



సమ్మెలోకి దిగిన కార్మికులు

మాగనూర్: వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తు మిషన్ భగీరథ కార్మికుల సమ్మె ప్రకటించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి అన్ని పంపింగ్ స్టేషన్లు, పంపులు మోటార్లు బంద్ చేసి డబ్ల్యూటీపీ పారేవుల గ్రామం ప్రధాన పంపు హౌజ్ వద్ద ధర్నా చేపట్టారు. దీని అంతటికి మిషన్‌భగీరథ అధికారుల నిర్లక్ష్యం చేయడమే అని సంఘం నాయకుడు మారెప్ప అన్నారు. అసలే చాలిచాలని వేతనాలు అందిస్తున్న అధికారులు అవి కూడా సమయానికి అందించకుండా నెలల తరబడి పెండింగ్‌లో ఉంచడం వలన బతుకులు ఎలా సాగుతాయని అన్నారు. వీరి సమ్మెతో మక్తల్, మాగనూర్, కృష్ణ మండలాల్లోని 56 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని సమస్య పరిష్కారించాలని కోరారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న గోవిందరాజు

మాగనూర్ (మక్తల్): అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కో కన్వీనర్ గోవిందరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం నుంచి ఇచ్చిన పిలుపు మేరకు అంగన్‌వాడీల టీచర్లు, ఆయాలు సమ్మెలోకి వెళ్లారు. వారికి మద్దతుగా తెలిపిన సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ ఆవిర్భవించినా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించలేదని, కనీస వేతనం అమలు చేయడం లేదని అన్నారు. ఆన్‌లైన్ యాప్ అనేక రకాల రికార్డుల నిర్వహణ, సెక్టర్ మీటింగ్, ప్రాజెక్టు మీటింగ్, గృహ సందర్శన తదితర పనులతో రాత్రి 11 అయినా నిద్రకు ఉపక్రమించని పరిస్థితి ఉందన్నారు. సమ్మె చేస్తుండడంతో ప్రభుత్వం సంబంధిత అధికారులతో బెదిరింపులకు పాల్పడుతూ సెంటర్ తాళాలు, సెల్‌ఫోన్లు ఇచ్చి సమ్మెలోకి వెళ్లాలని ఒత్తిడి తీసుకువస్తున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మె వదిలేదు లేదని అన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, నర్సింహులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె బాట పట్టిన అంగన్‌వాడీ టీచర్లు..

నారాయణపేట: అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా నియమించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిరవధిక సమ్మెను జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీ పార్కు వద్ద అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్రామరెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం ప్రారంభించి మాట్లాడారు. నారాయణపేట ప్రాజెక్టులోని టీచర్లు, హెల్పర్స్, సెంటర్స్ బంద్ చేసి తమ హక్కుల సాధనకై నిరవధిక సమ్మె బాటపట్టారన్నారు. కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్లకు రూ.10 లక్షలు, హెల్పర్స్‌కు రూ.5 లక్షలు ఇవ్వాలని, చివరి జీవితంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలపై అధికారుల వేధింపులు ఆపాలన్నారు. తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాలలో ప్రభుత్వాలు అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారన్నారు. కార్యక్రమంలో రమాదేవి, శారధ, నిర్మల, అర్చన పాల్గొన్నారు.

నిండుకుండల్లా చెరువులు, కుంటలు



వెన్నాచేడ్ పెద్ద చెరువువద్ద పూజలు చేస్తున్న గ్రామస్తులు

బాలానగర్: మండలపరిధిలో ఆదివారం రాత్రి నుంచి సుమారు రెండు, మూడు గంటల పాటు కురిసిన వర్షాలతో పలు గ్రామాలల్లో చెరువులు, కుంటలను నిండు కుండలను తలపిస్తున్నాయి. కాగా పలు గ్రామాలకు వచ్చే రోడ్లు, నాలాలు తెగడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రధానంగా మోతిఘణాపూర్ బీటీ రోడ్డుపై నీరు చేరడంతో ఉదయం నుంచి 6 గంటల పాటు రాకపోకలు నిలిపివేశారు. మోతీఘణాపూర్ నుంచి మేడిగడ్డ తండాకు వెళ్లే రహదారిపై నాలా తెగి కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మోతీగణాపూర్ నుంచి గంగదారిపల్లి బీటీరోడ్డుపై నీరు చేరడంతో కొన్ని గంటల పాటు రాకపోకలు నిలిచాయి.

గండేడ్: ఇటీవలి వర్షాలతో మండలంలో ఉన్న అన్ని చెరువులు దాదాపుగా పూర్తి సామర్థ్యంతో నిండాయి. వెన్నాచేడ్ పెద్ద చెరువు సోమవారం నుంచి మత్తడి దుంకుతోంది. దీంతో సర్పంచ్ పుల్లారెడ్డి అలుగు వద్దకు వెళ్లి గంగా పూజ చేసి కొబ్బరికాయ కొట్టారు. అనంతరం చెరువు దగ్గర ఉన్న బతుకమ్మ వద్ద, కట్టమీద ఉన్న మైసమ్మ వద్ద పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ బోయిని గోపాల్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల ముందస్తు అరెస్ట్



మరికల్‌లో ఆశావర్కర్ల నిరసనలో మాట్లాడుతున్న గోపాల్

మరికల్: ప్రభుత్వం ఆశా వర్కర్లకు వెంటనే వేతనాలు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ గోపాల్ డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యల సాధన కోసం సోమవారం హైదరాబాద్‌లో తలపెట్టిన ధర్నాకు తరలివెళ్తున్న వారిని పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నెలకు రూ.18 వేల వేతనం పెంచాలని, 2021 జూలై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల పీఆర్‌సీ ఏరియర్స్ చెల్లించాలన్నారు. ఆశా వర్కర్లకు ప్రసూతి సెలవుల పైన సర్క్యులర్ వెంటనే జారీ చేయాలని కోరారు. దీంతోపాటు పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శశికళ, అనురాధ, ఆశాబీ, భాగ్యలక్ష్మి, అమల, భాగ్యమ్మ, కవిత, నిర్మల, అంజమ్మ, భారతి, అభిక, రామలక్ష్మి పాల్గొన్నారు.

కృష్ణా: ఆశవర్కర్లను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంతపూచికత్తులో విడుదల చేశారు. ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ.. ప్రభుత్వ తమ ఉద్యమాన్ని అణిచివేస్తే మరింత బలంగా పోరాడుతామన్నారు.

మాగనూర్: ఆశా కార్యకర్తలకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కో కన్వీనర్ ఆంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌కు బయలుదేరిన ఆశా కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కనీస వేతనాలు అమలు చేయకుండా పారితోషకం పేరుతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుంటుందన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం అమలు చేయాలన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ మల్లేష్

మాగనూర్: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు అనేక విధాలుగా కృషి చేస్తున్నామని, ఇప్పటికే చాలా వరకు లేకుండా చేశామని ఎస్‌ఐ మల్లేష్ అన్నారు. సోమవారం మండలంలోని నేరడగంలో జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు కళాబృందం ఆధ్వర్యంలో అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. విద్యార్థులు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొత్త వ్యక్తులను నమ్మరాదని వారు ఎలాంటి వస్తువులు ఇచ్చిన తీసుకోరాదని, ఎవరికైనా అనుమానం ఉంటే వెంటనే పోలీస్ వారికి సమాచారం అందించాలన్నారు. విద్యార్థులు చిన్న చిన్న కారణాలతో బడి మానేసి పనులకు వెళ్తున్నారని, తోటి విద్యార్థులు ఎవరైనా బడి మానేసి పనులకు వెళ్లినా బాలకార్మికులుగా పనిచేసినా, పోలీసులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సురేందర్‌గౌడ్, లింగన్న, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.